Ananth & Ananth Series



An Accomplished Author With World-Wide Releases Of Two Of His English Novels **"The Enemy of the Mankind" and "The Dictator of the Dark"**

# సూర్యదేవర రామ్ మోహన రావు



# ఒక్కడే

# ఒక్కడే

-సూర్యదేవర రామ్‌మోహనరావు

# ఒక్కడే

లోకంలో ఎవరయినా ప్రకృతిని నాశనం చేయగలరు. వాతావరణాన్ని నాశనం చేయగలరు. జీవరాశిని నాశనం చేయగలరు. కాని సూర్యుడ్ని ఎవరయినా నాశనం చేయగలరా? చంద్రుడ్ని ఎవరయినా నాశనం చేయగలరా? నక్షత్ర మండలాన్ని ఎవరయినా నాశనం చేయగలరా? ఖచ్చితంగా చేయలేరు. అలాగే-

ప్రేమను కూడా ఎవరూ నాశనం చేయలేరు.

ద్వేషానికి నాశనం వుంది.

ప్రేమకు నాశనం లేదు.

ద్వేషం చంపుతుంది.

ప్రేమ బ్రతికిస్తుంది.

ప్రేమ నిత్యము. ప్రేమ సత్యము. ప్రేమ నిత్యనూతనం. అందులోనూ అప్పుడే వయసు చిగురించిన ప్రేమికుల మధ్య ప్రేమ బంధం అంటే అది కాంక్రీట్‌కన్నా బలమైనది, ధృడమైనది. ప్రేమతత్వం తెలీక అడ్డుకట్ట వేసిన ఎందో మట్టికొట్టుకుపోయారన్నది చరిత్ర.

✦ ✦ ✦ ✦ ✦

చినుకు చినుకుగా వర్షం చినుకులు రాలుతున్నాయి.

దగ్గరలోని గడియార స్థంభం సాయంత్రం నాలుగు గంటలు సూచిస్తోంది. పక్క వీధిలోని మసీదు స్పీకర్‌లోంచి అల్లా హెూ అక్బర్ అంటూ ప్రార్థన వినవస్తోంది.

అప్పటికే ఆకాశం మబ్బులు దట్టంగా కమ్ముకొని పెద్ద వర్షం పడే సూచనల కన్పిస్తున్నాయి. ఆ సమయంలో-

విశాలమైన ఆ వీధిలోకి-

వేగంగా ఎంటరయింది ఒక పల్సర్ బైక్.

పాతికేళ్ళ చాకులాంటి యువకుడు ఆ బైక్‌మీద వస్తున్నాడు. చాలా వేగంగా దూసుకొచ్చిన ఆ బైక్ కుడి పక్క

అటు ఇటూ రెండు గంగరావి చెట్ల మధ్య వున్న పెద్ద గేటుకు ఇవతలగా ఆగింది.

గేట్ లోపల ఇంద్రభవనం లాంటి కట్టడం వుంది. గేటు ముందు ఇద్దరు సెంట్రీలున్నారు. వస్తున్న యువకుడ్ని చూడగానే వాళ్ళిద్దరూ అలర్టవుతూ గబగబా దగ్గరకొచ్చారు.

"మళ్ళీ ఎందుకొచ్చావ్? వెళ్ళిపో!" అనరిచాడు ఒక సెంట్రీ లాఠీ అందుకొంటూ. రెండోవాడు అప్పటికే లాఠీ అందుకుని కొట్టబోయాడు. ఒకే దెబ్బ! ఆ యువకుడు కొట్టిన ఒకే దెబ్బకు కిక్కురుమనకుండా దబ్బున కిందపడిపోయాడు సెంట్రీ.

ఆ దృశ్యం చూడగానే రెండో సెంట్రీకి కళ్ళు పచ్చబడ్డాయి. వాడ్ని కాలర్ పట్టుకుని లాగి క్రూరంగా ముఖంలోకి చూసాడతను.

"పిచ్చి వేషాలేస్తే చంపేస్తాను. గేటు తెరు. నేను ఉమతో మాట్లాడాలి" కరుగ్గా వచ్చిన పని చెప్పాడు.

సెంట్రీ జాలిగా చూశాడు.

"వరుణ్ బాబు! గేటు తీయటానికి నాకే అభ్యంతరం లేదు. కాని లోన ఎవరూ లేరు" చెప్పాడు సెంట్రీ.

"నేన్నమ్మను...." అరిచాడు వరుణ్.

"నువ్వు నమ్మినా, నమ్మకపోయినా నేను చెప్పింది నిజం. లోన ఎవవరూ లేరు. రాత్రికి రాత్రి ఉమను తీసుకొని వాళ్ళంతా వెళ్ళిపోయారు."

"ఎప్పుడొస్తారు?"

"తెలీదు!"

"ఎక్కడికి వెళ్ళారు?"

"తెలీదు! గేటు దగ్గర కాపలా వుండేవాడ్ని ఆ విషయాలు మాకెలా తెలుస్తాయి సాబ్! కాని ఒకటి మాత్రం నిజం. ఆ పిల్లని నీకిచ్చి పెళ్ళి చేయరు. వాళ్ళు రాక్షసులు. ఆ విషయం తెలిసికూడా నీకెందుకీ పట్టుదల? మర్చిపోండి బాబూ. ఆ పిల్లను మర్చిపోండి."

"లంకలో అంతా రక్షసులే. సీతను రావణుడు ఎత్తుకెళ్ళాడని రాముడు వదిలేయలేదు. లంకను నాశనం చేసి సీతను తెచ్చుకున్నాడు. ఉమను నానుంచి ఎవరూ వేరు చేయలేరు. గేటు తియ్యి. ఓసారి లోనకెళ్ళి చూసొస్తా!"

"లోన ఎవరూ లేరు. చూసొస్తానంటే నా అభ్యంతరం లేదు. ఇంటి తాళాలు వాళ్ళే పట్టుకుపోయారు. కాని నీ పట్టుదల చూస్తుంటే నాకు సంతోషంగా వుంది వరుణ్ బాబు. అమ్మాయిగారు కారులో పోతూ పోతూ ఓ కాగితం ఉండ నా కాళ్ళముందు పడేసి పోయారు. అదృష్టంకొద్దీ అయ్యన్నపాత్రుడు చూళ్ళేదుగాని లేకపోతే నా కాళ్ళు నరికేసేవాడు. ఆ కాగితం ఉండని అలానే దాచి వుంచాను. నీకు ఉపయోగపడుతుందేమో చూడు!" అంటూ సెంట్రీ బాక్స్‌లోని సీక్రెట్ ప్లేస్‌లోంచి చిన్న కాగితం ఉండని తెచ్చి వరణ్ చేతికి అందించాడు సెంట్రీ.

జాగ్రత్తగా దాన్ని విప్పి చూశాడు వరుణ్!

అది ఉత్తరం!

ఉమ తన కోసం రాసిన ఉత్తరం!

వరుణ్–

మై లవ్–

ఐ లవ్ యూ రా–

ప్రాణంకన్నా ఎక్కువగా నిన్నే ప్రేమిస్తున్నాను. కాని తిరిగి నిన్ను చేరుకోగలనో లేదో? ఎప్పటికి నిన్ను చూస్తానో కూడా తెలీదు. అయినా బ్రతికుంటాను. ప్రాణంపోయే ఆఖరి క్షణం వరకూ నువ్వొస్తావని, నన్ను దక్కించుకుంటావని కొండంత ఆశతో ఎదురుచూస్తుంటాను. నీ సెల్ ఎప్పుడూ దగ్గర వుంచుకో. ఏమాత్రం అవకాశం వున్నా నీకు ఫోన్ చేస్తాను. నన్ను ఎక్కడికి తీసుకుపోతున్నారో నాకే తెలీదు... అదో... అన్నయ్య వచ్చేస్తున్నాడు. వుంటాను... నీ ఉమ..."

చాలా హడావిడిగా రాసిన ఉత్తరం అది.

ఆ ఉత్తరం చదవగానే వరుణ్‌కి దుఃఖం ఆగలేదు. ఉత్తరాన్ని ముఖానికి చేర్చి చిన్నగా ఏడుస్తూ అలాగే మోకాళ్ళ మీద అక్కడే కూర్చుండిపోయాడు.

అతడి ఆవేదనకు ఆకాశం కూడా కరిగిపోతుందా అన్నట్టు ఒక్కసారిగా ఉధృతమైంది వాన. సరిగ్గా అదే సమయంలో మెరుపులా దూసుకొచ్చి అక్కడ ఆగిందొక పోలీస్ వ్యాన్.

ఉలికిపడి వరుణ్ లేచేలోపలే–

వ్యాన్‌లోంచి దూకిన పది మంది పోలీసులు వరుణ్‌మీద పడ్డారు. అతడ్ని అలాగే ఎత్తి వ్యాన్‌లోకి విసిరేసి ఎక్కి కూర్చుని డోర్ మూసారు. ఒక ఎస్సై వరుణ్ బైక్‌ని స్టార్ట్ చేసి పోలీస్ వ్యాన్‌ను అనుసరించాడు.

కన్నుమూసేలోన అంతా జరిగిపోయింది.

కుండపోతగా పడుతున్న వర్షాన్ని కూడా మర్చిపోయి దూసుకుపోతున్న పోలీస్ వ్యాన్‌నే చూస్తూ శిలా విగ్రహంలా నిలబడిపోయాడు సెంట్రీ. వ్యాన్‌లోంచి వరుణ్ అరుపులు ఇంకా అతనికి విన్పిస్తూనే వున్నాయి.

✦ ✦ ✦ ✦ ✦

అది పోలీస్ కమీషనర్ రాఘవ నివాసం.

అంతక్రితమే పోలీసులు వరుణ్‌ని వ్యాన్‌లో తీసుకొచ్చి ఇంట్లో వప్పగించి వెళ్ళిపోయారు. అప్పుడు కూడా బయట నలుగురు కానిస్టేబుల్స్ డ్యూటీలో వున్నారు.

కమీషనర్ రాఘవగార్కి ఇద్దరు సంతానం.

పెద్దమ్మాయి ఇందుమతి.

రెండోవాడు వరుణ్.

ఇద్దరికీ అయిదేళ్ళ వయసు వ్యత్యాసం.

సుమారు ముప్పై సంవత్సరాల ఇందుమతికి అయిదేళ్ళ క్రితమే ఐ.ఏ.ఎస్. అధికారి సుకుమార్‌తో పెళ్ళి జరిగింది. ఆయన ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో ఏదో జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం తన మూడేళ్ళ కూతురు కల్పనతో ఇందుమతి పుట్టింటికొచ్చింది. అదీ వరుణ్ ప్రేమ విషయం తల్లి ఫోన్ చేసి చెప్పగా విని వచ్చింది. ఇంకా ఇక్కడే వుంది.

కమీషనర్ భార్య పేరు మీనాక్షి.

ఇద్దరూ ఆదర్శ దంపతులని చెప్పుకోవచ్చు.

వరుణ్, ఉమల ప్రేమ వ్యవహారం విపరీత పరిణామాలకు దారి తీస్తున్న తరుణంలో ఇటు రాఘవ తన కొడుకును, అటు పాత్రుల కుటుంబం ఉమామహేశ్వరిని జాగ్రత్త పెట్టుకునే ఏర్పాట్లలో మునిగిపోయారు. ఈ

పరిస్థితిలో సాయంత్రం ఎలాగో తెప్పించుకొని వరుణ్ అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్ళటంతో రాఘవ పోలీసుల్ని పంపించి కొడుకును వెనక్కి రప్పించుకోవటం జరిగింది.

బయట ఇంకా వర్షం పడుతూనే వుంది.

సమయం అయిదున్నరకే చీకటి పడిపోయింది. బంగ్లా అంతటా విద్యుద్దీపాలతో పట్టపగల్లా వుంది.

ఒక సోఫాలో అమాయకంగా కూర్చుని గోళ్ళు గొల్లుకుంటున్నాడు వరుణ్. అవతల సోఫాలో తల్లి మీనాక్షి, అక్క ఇందుమతి కూర్చున్నారు. కమీషనర్ రాఘవ చేతులు వెనక కట్టుకుని పెద్దపులిలా అటు యిటు పచార్లు చేస్తున్నాడు. ఆయనకు కొడుకు మీద పీకలదాకా కోపం వుంది. కాని ఏమాత్రం అరిచినా మీనాక్షి కొడుకుని సపోర్ట్ చేస్తూ వార్ డిక్లేర్ చేస్తుంది. అందుకే కోపాన్ని అదుపుచేసుకోక తప్పటం లేదాయనకు.

చివరకు విసుగ్గా కొడుకు వంక చూసాడు.

"యూ ఆర్ ఏ ఫూల్... ఇడియట్... లోకంలో ఆడపిల్లే దొరకనట్లు పోయి పోయి వాళ్ళ చెల్లెల్లే నీకు కావాల్సి వచ్చిందా? ఇంత జరిగినా నీకు బుద్ధి రాలేదా? ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ ఆ ఇంటికెళ్ళావ్?" ఇంత లావున నోరు తెరిచి ఆయన గొంతు చించుకు అరిచినా-

తనకేమీ పట్టనట్టు కూర్చున్నాడు వరుణ్.

దాంతో మరింత రెచ్చిపోయాడాయన.

"నా మాటలు విన్పించటం లేదా? చెవుల్లో చెట్లు మొలిచాయా? ఆ ఉమని నువ్వు మర్చిపోవాలి. అర్థమైందా?" చూపుడు వేలు ముఖంమీద ఆడిస్తూ హెచ్చరించాడాయన.

"అర్థమైంది!" అన్నాడు చిన్నగా.

"ఏమర్థమైంది?"

"ఏదన్నా సమస్య వస్తే మమ్మీని మీరు వదిలేస్తారని!"

"ఆఁ...!"

కొడుకు ఏమంటున్నాడో మొదట అర్థం కాలేదాయనకు. అర్థమైన కూతురు ఇందుమతి మాత్రం చిన్నగా నవ్వేసింది. మీనాక్షి పెదవుల మీద కూడా ముసి ముసిగా నవ్వు విరిసింది. కాని కమీషనర్ ముఖం మరింత చిటపటలాడింది. భార్య వంక విసుగ్గా చూసాడు.

"చూసావా? చూసావా వాడేమంటున్నాడో? సమస్య వస్తే నిన్ను నేను వదిలేస్తానట. బోడిగుండుకి బొటన వేలుకి లింకు పెడతాడేమిటి? అసలేమనుకుంటున్నాడు వాడు? వెనకేసుకొస్తావ్‌గా! అడుగు. వాడి లవ్ ఎఫైర్‌కి, నేను నిన్ను వదిలేస్తాననటానికి ఎక్కడైనా సంబంధం వుందా?" ఎదురుగా సోఫాలో కూలబడుతూ నిలదీసాడు.

అయితే ఆయన ప్రశ్నకు మీనాక్షి బదులు చెప్పలేదు. వరుణ్ చెప్పాడు.

"ఎందుకు సంబంధం లేదు? మీరే చెప్పండి డాడీ! ఎన్ని సమస్యలు వచ్చినా మమ్మీని మీరు వదలరు గదా. మరి నన్నెందుకు డాడీ ఉమను వదులుకోమంటున్నారు?"

"అధిక ప్రసంగం. అబ్జల్యూట్లీ అధిక ప్రసంగం. ఏరా! చదువుకున్నావ్ ఆ మాత్రం తెలీదా? మాకు పెళ్ళయింది. కూతురి పెళ్ళి చేసాం. నేను తాతయ్యను అయ్యాను. అది అమ్మమ్మ అయింది. నీకు పెళ్ళి చేయాల్సిన బాధ్యత ఇంకా మిగిలుంది. చట్టరీత్యా భార్యాభర్తలమైన మాతో మీకేమిటి సంబంధం? మీది జస్ట్ లవ్. వయసులోని వ్యామోహం. ఉమ కాకపోతే సుమ! ఎవరినయినా నువ్వు పెళ్ళి చేసుకోవచ్చు. పెళ్ళికి ముందు ప్రేమలో పడితే

కష్టాలు తప్పవు. అందుకే మేం చూసే పిల్లని నువ్వు పెళ్ళిచేసుకుని హ్యాపీగా వుండు. మర్చిపో! ఉమను మర్చిపో.”

“అవున్రా తమ్ముడూ! ఆడపిల్ల వాళ్ళు వాళ్ళకే అంత పట్టుదల వుంటే మగపిల్లాడివి నీకేనా రోషం, అభిమానం లేంది. ఆ పిల్ల కోసం నువ్వెందుకురా కష్టాలు పడతావ్? మా మాట విని మర్చిపోరా!” అంటూ తండ్రిని సపోర్ట్ చేసింది ఇందుమతి.

“ఏమిటి? మీరు కూడా డాడీకి సపోర్టా? మేజరయిన ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఇద్దరూ ప్రేమించుకుని పెళ్ళి చేసుకుంటే ఆ పెళ్ళిని తల్లిదండ్రులు కూడా ఆపకూడదనే చట్టం వుంది. చట్టాన్ని కాపాడాల్సిన ఆయనే మర్చిపొమ్మంటున్నారు. ఇదేం న్యాయం?”

“షటప్...” అదుపుతప్పిన కోపంతో షౌట్ చేశాడు రాఘవ.

“చట్టం గురించి, న్యాయం గురించి నాకు చెప్తున్నావా? నీకేం అనుభవం వుందని! చట్టాన్ని గౌరవించేవాళ్ళ దగ్గర న్యాయం గురించి మాట్లాడినా ప్రయోజనం వుంది. కాని ఆ పాత్రులు చట్టాన్ని లెక్కచేయని క్రిమినల్స్. చట్టానికి దొరక్కుండా కోట్లు గడించిన బద్మాష్‌లు. అడ్డంవస్తే నరికేయటమేగాని న్యాయం వాళ్ళకి పనికి రాదు. వాళ్ళ బాబు లోకయ్యపాత్రుడు అయిదేళ్ళుగా శిక్ష అనుభవిస్తున్నాడు జైల్లో. ఆ కేసు నేను డీల్ చేసాను. వాళ్ళు నాకు శత్రువులు. నీకు పిల్లనెలా యిస్తారనుకున్నావ్? మరోసారి ఉమవంక చూస్తే నిన్ను చంపేస్తామని నాకే హెచ్చరిక జారీ చేసారు. నీకెందుకింత మొండి పట్టుదల? ఆఖరిసారిగా చెప్తున్నాను. నువ్వు ఉమను మర్చిపో. అంతే!”

“ఉమను వాళ్ళు తీసుకుపోయారు. ఎక్కడకు తీసుకుపోయారో తెలీదు.”

“అది వాళ్ళిష్టం.”

“ఉమకి ఇష్టం లేదు. అది నన్ను చూడకుండా వుండలేదు.”

“అయితే?”

“నేను దాన్ని చూడకుండా వుండలేను.”

“అంటే... ఆ పిల్ల కోసం చావాలనే నిర్ణయానికొచ్చావా?”

“పోరాడాలని నిశ్చయించాను డాడీ.”

“పోరాటం... ఎవరితో?” అంటూ అంత కోపంలో కూడా నవ్వేసాడాయన.

“నీకేమన్నా పిచ్చా? కొండను ఢీకొంటే పొట్టేలుకే నష్టం. నీకు నానుంచి గాని, డిపార్ట్‌మెంట్ నుంచి గాని సాయం రాదు. ఒక్కడివి ఎలా పోరాడతావ్? ఏం సాధిస్తావ్? అనవసరంగా జీవితాన్ని నరకం చేసుకోకు. ఉమను మర్చిపో.” అన్నాడు ఆర్డర్ వేస్తున్నట్టు.

బదులు చెప్పలేదు వరుణ్.

సింపుల్‌గా లేచి తన గదివైపు అడుగులేసాడు.

“నీ సమాధానం ఏమిట్రా?” వెనకనుంచి అరిచాడాయన.

“చెప్పారుగా! మర్చిపోడానికి ప్రయత్నిస్తాను.” అంటూ మెట్లెక్కి మేడమీది తన గదిలోకి వెళ్ళిపోయాడు వరుణ్.

రాఘవ అనీజీగా సోఫాలోంచి లేచాడు.

"నాకేదో డౌటుగా వుంది. ఆ ప్లిలను వీడు మర్చిపోతాడంటే నాకు నమ్మకం లేదు. వీడు బయటకు పోకుండా జాగ్రత్తగా వుండండి. మన బిల్డింగ్‌ని చుట్టి మరో నలుగురు సెంట్రీలను వేస్తాను" అంటూ హెచ్చరించి బయటకొచ్చి కార్లో కంట్రోల్‌రూంకి బయల్దేరాడాయన.

✦ ✦ ✦ ✦ ✦

ఆ రాత్రంతా వర్షం పడుతూనే వుంది.

వరుణ్ పెందలాడే భోంచేసి పడుకున్నాడు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఎక్కడికీ పోలేదు. ప్రశాంతంగా నిద్రపోడానికి ప్రయత్నించాడు. కన్ను మూసినా, తెరిచినా ఉమ రూపం కళ్ళముందు మెదులుతోంది. గతం గుర్తుకొచ్చి కలవరపరుస్తోంది. బలవంతంగా కళ్ళు మూసుకుని నిద్రలోకి జారుకున్నాడు.

మరునాడు ఉదయం కూడా వర్షం పడుతూనే వుంది.

సుమారు పదకొండు గంటలకుగాని వర్షం ఆగలేదు. ఆ తర్వాత కూడా వరుణ్ బయటకు వెళ్ళే ప్రయత్నం చేయలేదు. ఆతను బుద్ధిగా ఇంట్లో వుండటం చూసి అంతా తేలిగ్గా వూపిరి తీసుకున్నారు. తన గదిలో వీడియోగేమ్‌తో కాలక్షేపం చేసాడు వరుణ్.

మూడో రోజు ఉదయం ఉండబట్టలేక తల్లి మీనాక్షి అడిగింది.

"ఏరా వరుణ్! నిజంగానే ఉమను మర్చిపోతావుగా?" అంటూ.

చాలా ప్లజంట్‌గా నవ్వుతూ సమాధానం చెప్పాడు వరుణ్.

"డౌటే వద్దు మమ్మీ! మర్చిపోయాను! మీరంతా చెప్పాక కూడా ఇక ఉమ గురించి ఎందుకు ఆలోచిస్తాను? కాదంటే నాకు మనశ్శాంతి కావాలి. కొద్ది రోజులు ఎటన్నా టూర్‌కి వెళ్ళిరావాలనుంది. డాడీతో చెప్పు" అన్నాడు.

మీనాక్షి చాలా సంతోషించింది.

"నువ్వు మారాలిగాని టూర్‌కి ఏముందిరా. అలాగే వెళ్ళిరా. ఎక్కడికి వెళదామని?" అనడిగింది.

"గోవా బెటరనుకుంటున్నాను!" చెప్పాడు.

"ఇండియా కాదు. స్విడ్జర్లాండ్‌గాని, లండన్‌గాని వెళ్ళు."

"అంతదూరం అక్కర్లేదు. ఒక నెలరోజుల్లో తిరిగి వస్తాను. గోవా చాలు."

"అలాగే! డాడీతో చెప్తాలే."

తమ్ముడి అభిప్రాయం విని అక్క ఇందుమతి కూడా సంతోషించింది. మరునాడే ఆమె తన కూతురు కల్పనతో మధ్యప్రదేశ్ తన భర్త వద్దకు వెళ్ళిపోయింది.

కొడుకు టూర్‌కి వెళతానంటే కమీషనర్ రాఘవకి సంతోషంగానే వుంది. ఎందుకంటే కొంతకాలం ఫ్యామిలీ టెన్షన్లు తనకు తగ్గుతాయి. అలాగే వరుణ్ కూడా ఉమని పూర్తిగా మర్చిపోగలుగుతాడు. అందుకే ఫ్లయిట్‌కి టికెట్ బుక్ చేయిస్తానన్నాడు. కాని వరుణ్ అభిప్రాయం అదికాదు.

"సారీ డాడ్! విమానంలో ఇలా వెళ్ళి, అలా రావటం నాకు ఇష్టం లేదు. నా బైక్ మీదే వెళతాను" అన్నాడు.

మొదట కాదన్నా తర్వాత అంగీకరించాడాయన.

"ఈ రెండు ఎ.టి.ఎమ్. కార్డులు దగ్గరుంచుకో. ఎక్కడా డబ్బుకి ఇబ్బంది పడకు. చాలదంటే ఫోన్ చెయ్యి. మరికొంత నీ ఖాతాలో వేస్తాను. ఇక నీ జీవితంలో ఉమ అనే అమ్మాయి పేరు వినబడకూడదు" అంటూ హెచ్చరించాడు.

బుద్ధిమంతుడిలా తలూపాడు వరుణ్.

"మరో విషయం" తిరిగి తనే చెప్పాడాయన.

"నువ్వు ఇలా టూర్ వంకతో బయల్దేరి ఉమను వెతికే కార్యక్రమం పెట్టుకోవాలని నీ మనసులో కోరిక ఏదన్నా వుంటే విరమించుకో. ఎందుకంటే నువ్వలాంటి ప్రయత్నం చేసిన మరుక్షణం నీమీద అరెస్ట్ వారెంట్ డిక్లేర్ చేయిస్తాను. కన్నకొడుకువని కూడా చూడను. అంతేకాదు, నీమీద గోవావరకు నిఘా వుంటుంది. నీ బైక్ గురించి ప్రతీ చెక్‌పోస్టు నుంచి నాకు రిపోర్టు వస్తుంది."

"థాంక్స్ డాడ్! నా గురించి మీరు ఈ మాత్రం శ్రద్ధ తీసుకోవటంలో తప్పులేదు. అలాగే నేనూ ఉమను మర్చిపోతున్నాను. మళ్ళీ మళ్ళీ ఆ పేరు గుర్తుచేయకండి" అన్నాడు వరుణ్.

మరునాడు–

ఉదయం ఏడుగంటలకి ఇంట్లో టిఫిన్ చేసి బయలుదేరాడు వరుణ్. ఏర్‌బ్యాగ్‌లో నాలుగు జతల బట్టలు వేసుకున్నాడు. తల్లి మీనాక్షి కంటతడి పెట్టుకుంది.

"డోంట్‌వర్రీ మామ్! ఒక నెల రోజులు జాలీగా తిరిగి వచ్చేస్తాగదా. అంతా సవ్యంగా జరుగుతుంది. అనవసరంగా నా గురించి బెంగ పెట్టుకోవద్దు." అంటూ తల్లి కంటనీరు తుడిచి ఓదార్చాడు.

కమీషనర్ ఒకటికి పదిసార్లు జాగ్రత్తలు చెప్పి హెచ్చరించాడు. గేటు వరకూ వచ్చి కొడుకును సాగనంపారు.

పల్సర్ బండి వీధిలోకి రాగానే వేగం పుంజుకుంది.

అది సిటీ అవుటర్‌ను దాటగానే–

కమీషనర్‌కి మొదటి రిపోర్టు అందింది.

మహారాష్ట్ర బోర్డర్‌లోకి ఎంటర్ కాగానే–

రెండో రిపోర్టు అందింది.

కొడుకు చెప్పినట్టుగానే సిటీ వదిలనందుకు తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు కమీషనర్ రాఘవ.

✦ ✦ ✦ ✦ ✦

ఇవాళ ఉదయం నుంచీ ఆకాశం మబ్బులుగానే వుంది.

ఎండ తెలీకపోవడంతో ప్రయాణం ఆహ్లాదంగా వుంది.

విమానంలా మెత్తగా పరుగుతీస్తోంది పల్సర్.

సిటీ దాటిన కొద్దిసేపటికే తన సెల్ అందుకుని ఒక నెంబర్‌కి ఫోన్ చేసాడు వరుణ్.

వెంటనే లైన్‌లోకొచ్చాడు అవతలి వ్యక్తి.

"ఏరా శీను. నేను వరుణ్! ఏమైంది? ఇంకా బయల్దేరావా లేదా?" బండి పక్కకు తీసి ఒక చెట్టుకింద ఆపుతూ అడిగాడు వరుణ్.

"ఇప్పుడే బయలుదేరాను. నీ సంగతేమిటి? ఎక్కడున్నావ్?" అవతలి నుంచి శీను గొంతు విన్పించింది.

"సిటీ లిమిట్స్ దాటి పావుగంటయింది" చెప్పాడు.

"ఓకే! కీప్‌గోయింగ్. నా కోసం చూడకు. లాతూర్‌లో కలుసుకుందాం. బృందా లాడ్జిలో స్టే చెయ్యి. వచ్చేస్తాను."

"ఓకే! లేట్ చేయకు."

"వచ్చేస్తున్నారా!"

"ఓకే!"

లైన్ కట్ చేసాడు వరుణ్.

హెల్మెట్ సరిచేసుకుని బైక్‌ను ముందుకి దూకించాడు. దారిలో ఎదురైన ఒక పెట్రోల్ బంక్‌లో బండి ట్యాంక్ ఫుల్ చేయించాడు. తర్వాత ఇక ఎక్కడా ఆగలేదు.

సరిగ్గా పన్నెండు గంటలకి–

పల్సర్ లాతూర్ టౌన్‌లో ప్రవేశించింది.

హైవే నుంచి కొంచెం పక్క వీధిని ఆనుకొని వుంది బృందా లాడ్జి. వరుణ్ బైక్‌ని పార్కింగ్‌లో వుంచి రిసెప్షన్‌లోకి వెళ్ళాడు. లక్కీగా డబుల్‌రూం దొరికింది. రూంలోచేరి స్నానం చేసి సెటిలయ్యేసరికి టైం ఒంటిగంట.

రూంబాయ్‌ని పిలిచి ఫుల్ విస్కీ బాటిల్, చిప్స్, సిగరెట్ ప్యాకెట్, ఇంకా మీల్స్‌కి కూడా ఆర్డర్ చేసి డబ్బులిచ్చి పంపించాడు.

రూంబాయ్ వెళ్ళిన పది నిమిషాల్లోనే–

శీను లోనకొచ్చాడు.

ఇంచుమించుగా వరుణ్ వయసే శీను కూడా.

ఇద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్.

వరుణ్ ఉమల ప్రేమ గురించి శీనుకన్నా బాగా తెల్సినవాళ్ళు ఎవరూ వుండరు. కాలేజిలో డిగ్రీ మూడేళ్ళు చదివినా చివరి సంవత్సరం నుంచే వరుణ్, ఉమల మధ్య ప్రేమ చిగురించింది. గొడవలకు దారి తీసింది.

ఎలాగో ఫైనల్ ఎగ్జామ్స్ ముగిసాయి. ఆ తర్వాత నుంచే స్టార్టయింది అసలు ప్రాబ్లం.

"ఏమిట్రా ఇంత లేటు?" శీనుని చూడగానే అడిగాడు వరుణ్.

"ఎంత లేటు? నాకు తెలీక అడుగుతున్నాను. ఒక గంట ఇది పెద్ద లేటా? కూర్చో. ఇప్పుడే వస్తాను" అంటూ ఏర్ బ్యాగ్ అక్కడ పడేసి బాత్‌రూంలో ప్రవేశించాడు.

పావు గంటలో శీను కూడా స్నానం చేసి వచ్చేసరికి రూంబోయ్ అర్డరిచ్చినవన్నీ తెచ్చి టీపాయ్ మీద సర్ది వెళ్ళిపోయాడు. విస్కీ బాటిల్ చూడగానే శీను ముఖం వికసించింది.

"థాంక్స్ రా! అన్నీ రెడీగా వుంచావ్" అంటూ ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

"ఉందికదాని పీపాలా తాగేస్తే వూరుకోను. సింపుల్‌గా తీసుకుని భోంచేద్దాం!" హెచ్చరించాడు వరుణ్.

చెరో రౌండ్ ఫినిష్ చేసేవరకూ ఇద్దరూ మౌనంగానే వున్నారు.

సెకండ్ రౌండ్ ఆరంభించాక సిగరెట్ ముట్టించుకున్నాడు వరుణ్. శీను వంక చూసాడు.

"చెప్పరా! నేను వప్పగించిన పని ఏమైంది?" అడిగాడు.

"ఏదీ ఆ పకోడా విషయమే గదా?"

"అవును."

పకోడా అసలు పేరు పెంటయ్య. విస్కీలోని పకోడా టచింగ్‌గా తీసుకోడం చేత తెలిసిన వాళ్ళంతా పకోడాని

పిలుస్తారు. వాడు ఉమ అన్న అయ్యన్నపాత్రుడికి కుడి భుజంలాంటి వాడు. వెధవ సలహాలివ్వటం, వెధవ పనులు చేయించటంలో జీనియస్. చేతికి మట్టంటకుండా మర్డర్ ఎలా చేయించాలో వాడ్నడిగి తెలుసుకోవాల్సిందే! అంత డేంజర్ క్యారెక్టర్ వాడు. అయ్యన్నకి సంబంధించినంతవరకు పకోడాకి తెలీని రహస్యాలుండవు.

గ్లాసు ఫినిష్ చేసి తనూ సిగరెట్ ముట్టించుకున్నాడు శీను.

"పకోడాకి ఒక అలవాటుంది. ప్రతి రోజు రాత్రి ఎనిమిది గంటలకి వాడు వెన్నెల బార్ అండ్ రెస్టారెంట్‌కి వస్తాడు. పది గంటలవరకు అక్కడే వుంటాడు. ఒక్కోసారి ఒక్కడే వస్తాడు. ఒక్కోసారి వెంట ఒకరిద్దరితో కలిసి వస్తాడు. ఎంతో ముఖ్యమైన పని వుంటే తప్ప అక్కడికి రాకుండా వుండడు. నిన్న రాత్రి కూడా వాడ్ని వెన్నెల బార్‌లో చూసాను" వివరించాడు.

"ఆ ఇల్లు ఖాళీ చేసారు. నీకు తెలుసా?" అడిగాడు వరుణ్.

"ఏదీ... ఉమ వుంటున్న బంగళానా?"

"అవును. నిన్న సాయంకాలం ఇంట్లోంచి ఎలాగో తప్పించుకుని అక్కడికెళ్ళాను. సెంట్రీలున్నారు. ఇల్లు తాళం పెట్టి వుంది. మొన్న రాత్రే వాళ్ళు ఉమను తీసుకెళ్ళిపోయారట. ఇంతలో డాడీ పంపిన పోలీసులు వచ్చి నన్ను ఇంటికి లాక్కుపోయారు."

"ఉమ నుంచి సమాచారం ఏమీలేదా?"

"ఉంది. కానీ ఉపయోగపడదు. తననెక్కడకు తీసుకెళుతున్నారో తనకే తెలీదు. నా కోసం ఎదురు చూస్తానంది. ఈ లెటర్ చూడు."

ఉమ రాసిన ఉత్తరం శీను కిచ్చాడు.

చదివి భారంగా నిట్టూర్చాడు శీను.

"వాళ్ళకి సిటీలో ఇంకా బిల్డింగ్‌లున్నాయి. ఉమని ఎక్కడో దాచేసి వుంటారు" అన్నాడు.

చిన్నగా నవ్వుతూ తల అడ్డంగా వూపాడు వరుణ్.

"లేదురా! నా అంచనా కరెక్టయితే ఈపాటికే ఉమని సిటీ దాటించి ఎక్కడికో తీసుకుపోయుంటారు. సిటీలో వుంటే ఏదో విధంగా మేం కలుసుకుంటామని వాళ్ళకి తెలుసు."

"ఈ మాట కరెక్ట్. నిన్నాపటం కష్టమని వాళ్ళకి బాగా తెలుసు."

ఇద్దరూ నవ్వుకున్నారు.

మరో రౌండ్ ఫినిషయింది.

ఇంతలో వరుణ్ సెల్ రింగయింది.

"ష్! డాడీ అయివుంటారు. సైలెన్స్" అంటూ శీనును హెచ్చరించి సెల్ అందుకున్నాడు వరుణ్.

"ఎస్ డాడీ!" పలికాడు.

"ఎక్కడున్నావ్?" అవతలినుంచి గరగరలాడింది కమీషనర్ రాఘవ గొంతు.

"లాతూర్ అవుటర్‌లో బైక్ ట్రబులిచ్చింది డాడీ."

"కండిషన్‌లో వున్న బైక్ ట్రబులివ్వటం ఏమిటి?"

"ఇంజన్ ట్రబుల్ కాదు. టైరు పంక్చర్."

"రఫ్ డ్రైవింగ్ వద్దురా అంటే వినవు. జాగ్రత్త! ఇవాళకి లాతూర్‌లోనే విశ్రాంతి తీసుకుని ఉదయం బయల్దేరు. నైట్‌కి మళ్ళీ ఫోన్ చేస్తాను" వరుణ్ సమాధానం కోసం కూడా చూడకుండా లైన్ కట్ చేసాడాయన.

ఫోన్ పక్కన పడేసి–

విసుగ్గా చూసాడు వరుణ్.

"సమస్య డాడీతోనే.... ఫోన్ అవాయిడ్ చేయాలి. ఎలా?" అన్నాడు.

ఆ మాటకి కిసుక్కున నవ్వాడు శీను.

"దానికింత వర్రీ దేనికిరా బేటా! వెరీ సింపుల్" అన్నాడు.

"ఎలా?"

"నీ సెల్ నాకిచ్చి, నా సెల్ నువ్వు తీసుకో."

"తర్వాత?"

"తర్వాత ఏముంది? మీ డాడీ ఫోన్ చేస్తారు. నా గొంతు మార్చి చెప్తాను. సెల్ దొరికింది. మీరెవరో నాకు తెలీదంటాను. ఫినిష్!"

"ఇదేదో ఐడియా బాగానే వుంది. నువ్వు సరిగ్గా మేనేజ్ చేయాలి."

"డౌటా! నీ బైక్ మీద నీలా గోవా వెళుతున్న వాడ్ని. నీ సెల్ నాకో సమస్యా ఏమిటి! ప్రొసీడ్" అన్నాడు ఉత్సాహంగా శీను.

ఇద్దరూ మందు ఫినిష్ చేసి–

చక్కగా భోంచేసారు.

దాంతో నిద్ర తన్నుకు రావటంతో–

బెడ్‌కి అడ్డంగాపడి గాఢ నిద్రలోకి జారుకున్నాడు శీను. కాసేపు ఉమ ఆలోచనలు ఇబ్బందిపెట్టినా చివరకు తనూ నిద్రపోయాడు వరుణ్. ప్రయాణ బడలిక ఇద్దర్నీ గాఢనిద్రలో జోకొట్టింది.

✦ ✦ ✦ ✦ ✦

వరుణ్ బైక్ కాలేజి గేటు దాటి లోనకొస్తుండగా అక్కడ పార్కింగ్ ప్లేస్‌లో ఏదో గొడవ.

చుట్టూ స్టూడెంట్స్ గుంపు చేరిపోయి–

భయం భయంగా చూస్తున్నారు.

బైక్ లాక్ చేసి అటు అడుగులేస్తూ–

ఓ కుర్రాడ్ని పిలిచి అడిగాడు.

"ఏం జరుగుతోందక్కడ?" అని.

"శంకర్రావు ఎవరితోనో మాట్లాడుతూండగా ఉమాసుందరి పొరబాటున వచ్చి గుద్దుకుందట. ఆమె బాడీగార్డు లిద్దరు శంకర్రావుని చితగ్గొట్టే ప్రయత్నంలో వున్నారు. ఎవరు చెప్పినా విన్పించుకోవటం లేదు" చెప్పాడా కుర్రాడు.

ఆ మాట వింటూనే వేగంగావెళ్ళి కుర్రాళ్ళని తప్పించుకుని మధ్యలో ప్రవేశించాడు.

దుక్కలాంటి ఇద్దరు గూండాలకు ఎదురుగా ఉమ నిలబడుంది. ఆమె వెనక శంకర్రావు నిలబడున్నాడు. పులిని చూసిన లేడిలా బెదిరిపోతున్నాడు. ఉమ తప్పుకుంటే చాలు! శంకర్రావు ఎముకలు విరిచేయటానికి వాళ్ళిద్దరూ

సిద్ధంగా వున్నారు.

"అమ్మాయి గారు... మీరు తప్పుకోండి. వీడ్ని చంపేస్తాం!" అరుస్తున్నాడొకడు.

"ఏయ్! నాదే తప్పని చెప్తున్నాగా! అతన్ని వదలండి. ప్లీజ్...." ఉమ నచ్చచెప్పాలని చూస్తోంది.

"అమ్మాయిగారూ! మమ్మల్ని విసిగించకండి. తప్పు మీది కాదు. ఆ రాస్కెల్స్‌ది. మీరు వచ్చి అలా డాష్ ఇస్తారని ఆశించే అలా దారికి అడ్డంగా నిలబడ్డారు. ఈ పొరబాటుకు వాడ్ని శిక్షించాల్సిందే. తప్పుకోండి." రెండోవాడు అరిచాడు.

సుమారు అయిదు నిమిషాలుగా నలుగుతున్న సమస్య యిది. గూండాలు ఇద్దరూ ఎలాగయినా శంకర్రావుని చితకబాదాలని తెగ ఉత్సాహపడిపోతూ ఉమని చుట్టి వస్తున్నారు. శంకర్రావు కూడా వాళ్ళకి అందకుండా ఆమెను కవర్ చేసుకుని తిరుగుతున్నాడు.

వస్తూనే వరుణ్ శంకర్రావుని తన పక్కకిలాగి నిలబెట్టి, ఉమ వంక కోపంగా చూశాడు.

"మిస్ ఉమా! కిందటిసారే నిన్ను హెచ్చరించాను. కాలేజీ ఆవరణలోకి నీ బాడీగార్డ్సుని తీసుకురావద్దని. ఏమిటిదంతా?" అనడిగాడు.

"సారీ వరుణ్! వాళ్ళు నా మాట వినటం లేదు... కొత్తవాళ్ళు..." నసిగింది ఉమ. ఈలోపల గూండాలు ఇద్దర్లో ఒకడు తొందరపడిపోయాడు.

"ఏందిబే మధ్యలో... కాలేజీ నీ బాబుగాడిదా... మా అమ్మాయి గారిని హెచ్చరించేంత మొనగాడివా! ఆఁయ్...." అంటూ వరుణ్ మీదకి చేయి విసిరాడు.

అంతే–

"ఒరే బండోడా... అయిపోయావ్‌రా!" వినబడేలా గొణుగుతూ పక్కకు తప్పుకుంది ఉమ.

అదే సమయంలో–

తన ముఖంమీదికి వస్తున్న ప్రత్యర్థి చేతిని తన ఎడంచేత్తో బ్లాక్ చేస్తూ, కుడి చేతి పిడికిలి బిగించి వాడి ముఖం మీద బలంగా కొట్టాడు వరుణ్.

వరుణ్ గురించి తెలిసిన వాళ్ళెవరూ అతన్ని కవ్వించాలని, రెచ్చగొట్టాలని చూడరు. ఎందుకంటే, జంకుగొంకు తెలీని మార్షల్‌ఆర్ట్స్ యోధుడతను. కమీషనర్ రాఘవ తన కొడుక్కి చిన్నప్పట్నుంచి చదువుతోబాటు యుద్ధ విద్యలు కూడా నేర్పించాడు. ఎందుకంటే, కొడుకును డిపార్టుమెంట్‌లో తనకన్నా పై అధికారిగా చూడాలని జేమ్సుబాండ్‌లా కొడుకు పేరు తెచ్చుకోవాలని ఆయన ఆశ.

పెద్ద ఇనుప సుత్తి ఏదో తన ముఖాన్ని దారుణంగా తాకినట్టు కెవ్వున అరిచాడు గూండా. వాడి అరుపు పూర్తిగాకముందే వరుణ్ పాదం వాడి పక్కటెముకల్ని బలంగా తాకింది.

మరోసారి పేగులు తెగిపోతున్నంత బాధతో ఇంతలావున నోరు తెరిచాడు వాడు. కాలు వెంబడే ఎగిరి స్టూడెంట్స్‌ని విరగదోసుకుంటూ దొర్లుకెళ్ళి అవతల పడ్డాడు.

రెండో గూండాకి మతిలేదు.

అసలు తన కళ్ళముందు–

అక్కడ ఏం జరుగుతోందో అర్థం కాలేదు.

నలుగురు యావరేజ్ మగాళ్ళని కలేసికొట్టే దమ్మున్న మగాడు తన సహచరుడు. ఈ కుర్రాడి చేతిలో వాడు దెబ్బలు తినటం ఏమిటి? ఎవడీ కుర్రాడు?

వాడి ఆలోచనలు పూర్తిగాకముందే ఉమ ముందుకొచ్చింది.

"ఒరే దున్నపోతుల్లారా..! వరుణ్ చేతిలో ఛస్తార్రా. నేను మర్యాదగా చెపితే మీరు వినలేదు. పొండిరా... అర్జంటుగా ఇక్కడినుంచి పారిపోండి" అంటూ వాళ్ళకి సూచనలిచ్చింది.

చటుక్కున ఆమె చేయి అందుకుని వెనక్కి లాగాడు వరుణ్.

"ఏమిటి సలహాలిస్తున్నావ్? నీ సంగతి తర్వాత చెప్తాను. ఇలా నిలబడు. ఫైటింగ్ చేస్తావా... కమాన్. శంకర్రావుని చితగ్గొడతారా... కొట్టుబే! ఒరే శంకర్రావ్ నువ్వలా నిలబడ్రా. వాడు నిన్ను ఎలా కొడతాడో చూస్తాను. కమాన్...." మాట్లాడుతూనే వున్నాడు వరుణ్.

ఎప్పుడు కదిలాడో ఎవరూ గమనించలేదు.

గూండా గారి కళ్ళముందు మెరుపులు మెరిసాయి. పంచరంగుల నక్షత్రాలు కన్పించాయి. ఎక్కడ ఎప్పుడు ఎలా దెబ్బ తగిలిందో కూడా వాడికి అర్థం కాలేదు. దారుణంగా అరుస్తూ విరుచుకుపడిపోయాడు. అదే వేగంతో మొదటివాడ్ని కూడా లాక్కొచ్చి ఇద్దర్నీ కలిపి కుక్కల్ని కొట్టినట్టు కొట్టాడు.

"చచ్చిపోతాం సార్... కొట్టకండి" అనరుస్తూ చేతులెత్తేసారు వాళ్ళిద్దరూ.

"చచ్చిపోతారు. మరోసారి మీ ముఖాలు కాలేజీ క్యాంపస్‌లో కన్పిస్తే నిజంగానే చచ్చిపోతారు. రేయ్! ఈ కుక్కల్ని లాక్కెళ్ళి గేటు బయట పారేయండిరా!" అంటూ సూచించి అక్కడ్నుంచి కదిలాడు వరుణ్.

"ఏయ్ వరుణ్...! ప్లీజ్. ఆగాగు" అనరుస్తూ అతడి వెనకే పరుగెత్తుకు వచ్చింది ఉమ.

ఆగలేదు వరుణ్.

సిగరెట్ ముట్టించుకుంటూ తన దారిన పోబోయాడడు.

ఆమె అతడి దారికి అడ్డంగా వచ్చేసింది.

ఇవాళ మరింత అందంగా వీనస్‌లా మెరిసిపోతోంది ఉమ. చుడీదార్‌లో ఒద్దికగా ముద్దబంతిలా వుంది.

"పిలిస్తే ఆగవా?" దబాయించింది.

"చూడు! నీ మూలంగా నీ వెంటవచ్చే రౌడీల మూలంగా ఇక్కడ అనవసరమైన సమస్యలు వస్తున్నాయి. నీ రక్షణ కోసం నీ అన్న ఎంతమంది గూండాల్ని పంపిస్తాడో నాకనవసరం. కాలేజి లీడర్‌గా నా సలహా ఇక్కటే. వాళ్ళందర్నీ గేటు బయట వదలి రాలేదంటే ఈసారి గూండాలతో వదలను. డైరెక్ట్‌గా నీ అన్న అయ్యన్నపాత్రుడితో మాట్లాడాల్సి వుంటుంది..." హెచ్చరించాడు.

"మాట్లాడ్డం ఏమిటి అసహ్యంగా! చితకతన్ను సంతోషిస్తాను" అంది ఉత్సాహంగా.

"అంటే... ఈ వంకతో నన్ను రచ్చకీడ్చాలని ప్లానా! చూడు బేబీ..."

"చూస్తున్నాను... చెప్పు!"

ఆమె చూపులు తన కళ్ళలోకి సూటిగా చొరబడుతుంటే సడెన్‌గా తడబడ్డాడు వరుణ్. చటుక్కున ముఖం తిప్పుకున్నాడు.

"చూడమంటే కళ్ళలోకి చూడమని కాదు. నా మాటలు వినమని. అయినా సూదంటూ రాళ్ళలా ఆ చూపులేమిటే..." నసిగాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Okkade**

* * *